క్లుప్తంగా

ఎస్ఎస్ఆర్ కళాశాలపై చర్యలకు డిమాండ్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా పరీక్షకు దూరం చేసిన ఎస్ఎస్ఆర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వారు బుధవారం తిరుపతి ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఐఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. వైఎస్ఆర్ విద్యార్థి సంఘం ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్, ఏపీవీహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముని తదితరులు పాల్గొన్నారు.

ఉషాకు ఉత్తమ మహిళా అవార్డు


ఉషా క్రాంతి గాదేను సన్మానిస్తున్న పోస్టల్ ఎస్పీ నరసప్ప

తిరుపతి సిటీ: పోస్టల్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన బేబీపట్టు ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన ఉషాక్రాంతి గాదేకు ఉత్తమ మహిళ, ఉత్తమ డాక్ ఘర్ నిర్యత్ కేంద్ర అవార్డులను పోస్టల్ జిల్లా సూపరింటెండెంట్ నరసప్ప అందజేశారు. ఆమెను జిల్లా పోస్టల్ కార్యాలయంలో బుధవారం సన్మానించారు. పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్ వసంత, ఏఎస్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూ వీసీకి అరుదైన అవకాశం


విజిటర్స్ మీట్‌లో వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి

తిరుపతి సిటీ : ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ నెల 3న జరిగిన విజిటర్స్ మీట్‌లో తిరుపతి సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి అరుదైన అవకాశం లభించింది. దేశ వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల వీసీలు పాల్గొనే విజటర్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తనిఖీ

పాకాల : మండలంలోని వడ్డేపల్లిలో జరుగుతున్న ఈ-పంట నమోదును బుధవారం ఆర్డీవో రామ్మోహన్ తనిఖీ చేశారు. వరి పంటను పరిశీలించారు. రైతులు ఈ పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ రుణాల్లో అధికారుల అత్యుత్సాహం

వెనుకబడిన తరగతుల వారితో పాటు ఇతర కులాల నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పన కోసమని కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కులాల వారిగా మండలానికి కొన్ని యూనిట్లు కేటాయించింది. అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. చంద్రగిరి మండల అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇంటర్వ్యూలు నిర్వహించకుండానే లబ్ధిదారులను ఎంపిక చేయడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

- ఇంటర్వ్యూలు నిర్వహించకుండానే లబ్ధిదారుల ఎంపిక
- 68 యూనిట్లకు 562 మంది దరఖాస్తు
- అభ్యర్థుల ఆందోళన
- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రేపు ఇంటర్వ్యూలకు ఆహ్వానం


చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయం

చంద్రగిరి : చంద్రగిరి మండలంలోని వివిధ కులాలకు సంబంధించి 68 యూనిట్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు సబ్సిడీ కింద యూనిట్ కాస్ట్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు రూ.1.90 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు మండల అధికారులు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. మండల వ్యాప్తంగా 562 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి వుంది. దరఖాస్తుదారులు పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. నియోజకవర్గంలో చంద్రగిరి మినహా మండలాల్లో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. చంద్రగిరిలో మాత్రం ఇంటర్వ్యూలను నిర్వహించకుండానే అర్హుల జాబితాను బ్యాంకర్స్‌కు అందజేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో హల్ చల్ చేసింది. దీనిపై బీసీ కార్పొరేషన్‌తో పాటు ఇతర కార్పొరేషన్ కింద యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి ధోరణి అవలంబించలేదని మండిపడుతున్నారు.

అధికార పార్టీ నేతల మెప్పుకోసమేనా..?

అధికార పార్టీ నేతల మెప్పుకోసమే అధికారులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 562 మంది దరఖాస్తు చేసుకుంటే, ఇంటర్వ్యూలను నిర్వహించకుండానే లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై బీసీ సంఘాల నేతలు సైతం మండిపడుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఎలాంటి ప్రొసీడింగ్స్ లేవన్నారు.

సాయంత్రానికి ఇంటర్వ్యూ నిర్వహణ అంటూ ప్రకటన

కార్పొరేషన్ రుణాల అవకతవకల విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఎంపీడీవో కార్యాలయ అధికారులు బుధవారం సాయంత్రానికి పత్రికా ప్రకటన విడుదల చేశారు. కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్ ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థులు శుకరవారం ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకుని రావాలని పేర్కొన్నారు.

నోటీస్ బోర్డు

- తిరుపతిలోని మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో గురు, శుక్రవారాల్లో 27వ అఖిల భారతీయ పోస్టల్ కేరమ్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు.
- ఇందిరా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో గురువారం ఉదయం 9 నుంచి తపాల శాఖ ఉద్యోగులకు క్యారమ్స్ క్రీడా పోటీలు ప్రారంభం.
- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో గురువారం ఉదయం 9 నుంచి టీటీడీ ఉద్యోగులకు క్రీడా పోటీలు ప్రారంభం.
- మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాకళా వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మహిళలకు సన్మానం.
- కబ్జా నుంచి ఓటేరు చెరువును కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్షలు ప్రారంభం.
- ఎంఆర్ పల్లిలోని ఎంఎంబీజీ స్కూల్లో సాయంత్రం 4 గంటలకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు, ప్రముఖ మహిళలకు సన్మానం.
- శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన.

వేడుకగా దోర్నకంబాల గంగ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి : దోర్నకంబాలలో గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారిని భజన గుడి ప్రాంగణంలో కొలువుదీర్చారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సామూహిక అంబళ్లు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్, చెవిరెడ్డి లక్ష్మీ అమ్మవారికి సారె అందజేశారు. ప్రత్యేక పూజలు చేశారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

తిరుపతి అర్బన్: చిన్న పిల్లలతో పనిచేయిస్తే రూ.50 వేల జరిమానా, 6 నెలలు జైలు శిక్ష విధిస్తామని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలెప్ప తెలిపారు. ఆయన బుధవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో బాల కార్మికుల చట్టం పోస్టర్లు అంటించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకోరాదన్నారు. ఇటీవల కాకినాడ కోర్టు ఒక యజమానికి రూ.25 వేల జరిమానా విధించిందన్నారు. కార్మికశాఖ అధికారులు ఎం.ప్రవీణ్‌కుమార్, శ్రీమన్నారాయణ, ఎం.రాజయ్య, రంగనాథం పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌కు సన్మానం



తిరుపతి రూరల్ : చెర్లోపల్లె పంచాయతీ సర్పంచ్ బి.సుభాషిణి మంగళవారం ఢిల్లీలో ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. ఆమెను, ఆమె భర్త శుభగిరినాయుడును బుధవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తా కోటేశ్వర నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు.

కృష్ణారెడ్డికి ఘన నివాళి


కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

భాకరాపేట : యండపల్లివారిపల్లెలో బుధవారం నిర్వహించిన పెట్రోల్ బంకు యజమాని కృష్ణారెడ్డి కర్మక్రియలకు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరయ్యారు. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాస్కర్‌రెడ్డి, సాకిరి భూపాల్, ఉమామహేశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



తిరుపతి క్రైమ్: అంతర్జాతీయ మహిళా దినం వారోత్సవాల్లో భాగంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 254 మంది క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, గుండెపోటు, కంటి తదితర పరీక్షలు చేయించుకున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు.

ఓటేరు చెరువును కాపాడాలని నిరసన

- చెరువును పూడ్చిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ


చెరువు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

తిరుపతి రూరల్ : మండలంలోని ఓటేరు చెరువును పూడ్చివేసిన భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ఓటేరు చెరువును పరిశీలించారు. అధికారుల తీరుకు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని 370, 376, 377 సర్వే నంబర్లలో వున్న ఓటేరు చెరువును అర్ధరాత్రో భూకబ్జాదారులు 30 టిప్పర్లతో మట్టితోలి పూడ్చివేశారని తెలిపారు. వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ చెరువును కాపాడాల ని రెండు నెలల క్రితం కలెక్టర్‌ను కోరామన్నారు. భూ కబ్జాదారులు చెరువును పూడ్చివేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. చెరువును కాపాడాలని వెళ్లిన సీపీఐ నాయకులను పోలీసులు హెచ్చరించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఓటేరు చెరువు అనుకొని స్థానిక చంద్రగిరి ఎమ్మెల్యే నాని నివాసం ఉన్నప్పటికీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక పెద్ద పెద్ద రాజకీయ నాయకులు వున్నారని తెలిపారు. ఓటేరు చెరువును కాపాడకపోతే సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలతో గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. ఓటేరు చెరువును కాపాడాలని గురువారం నుంచి తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు ఎస్ శివ, శ్రీరాములు, విజయ, అలివేలమ్మ, అల్లాబక్షు, రవి, కిషోర్, శ్రీనివాసులు, కార్తీక్ పాల్గొన్నారు.

సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఓ హోటల్‌లో బుధవారం స్మైల్ ఫౌండేషన్ సహకారంతో 45 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు స్టెమ్(సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్)పై ఒక్క రోజు శిక్షణ ఇచ్చా రు. జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.భానుప్రసాద్ మాట్లాడుతూ స్టెమ్ ఎడ్యుకేషన్ సాంకేతిక విషయాలను ప్రాక్టికల్‌గా తెలుసుకోవడానికి ఈ శిక్షణ దోహదపడిందని తెలిపారు. స్మైల్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె.విజయ్‌సారథి పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్లకు అనుమతి లేదు

తిరుపతి తుడా: రుయాలో గిరిజన కార్పొరేషన్ కింద ఏర్పాటు చేస్తున్న అరకు వ్యాలీ స్టాల్స్‌లో టిఫిన్ సెంటర్లకు అనుమతి లేదని గిరిజన కార్పొరేషన్ లిమిటెడ్ డివిజినల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బయట ఉత్పత్తు ల విక్రయాలు చేపట్టడం, టిఫిన్ సెంటర్లను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన కార్పొరేషనా.. మజాకా అన్న శీర్షికన బుధవారం సాక్షి దిన పత్రికలో కథనం వెలువడింది. దీనిపై ఆయన స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన స్టాల్స్‌పై ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా వర్సిటీలో ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రారంభం

తిరుపతి సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను బుధవారం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయ, జ్యూట్, స్వయంసహాయ సంఘాల తయారీ ఉత్పత్తులు ప్రదర్శించనున్నారు. సారా సరోజినీ, మహిళా అధ్యయన విభాగ ఇన్‌చార్జి నీరజ, హైమావతి పాల్గొన్నారు

అన్నదానం



తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఎన్ఎంయూ వ్యవస్థాపకుడు రామ్మోహన్‌రావు 20వ వర్ధంతిని బుధవారం జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు నేతృత్వంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 500 మందికి అన్నదానం చేశారు. యూనియన్ నేతలు డీవీఆర్ కుమార్, భాస్కర్, దామోదర్, రమణయ్య, దినకర్, ఎంఆర్ కుమార్ పాల్గొన్నారు.

ధర్మకర్తల మండళ్లలో రజకులకు స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న సావిత్రి

తిరుపతి కల్చరల్: ఆలయాల ధర్మకర్తల మండళ్లలో రజకులకు స్థానం కల్పించాలని రాష్ట్ర రజక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి విజ్ఞప్తి చేశారు. ఆమె బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో త్వరలో మోడరన్ దోబీఘాట్లు ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. తిరుపతి కార్పొరేషన్‌లో 1976లో నిర్మించిన 56 దోబీఘాట్లలో 70 శాతం మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. వాటి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. రజకులకు ఇస్తున్న విద్యుత్ రాయితీ 15 యూనిట్లను 250 యూనిట్లకు పెంచాలని కోరారు. అక్కినపల్లి లక్ష్మయ్య, కరాటి చంద్ర, మధు, గంధంబాబు, సుధాకర్, అశోక్, రాజయ్య, యశోద, జశ్వంత్, మునస్వామి, దినేష్, వెంకటముని, శంకర్, గీత, జయంతి పాల్గొన్నారు.


రుయాలో వసతుల కల్పనకు చర్యలు

తిరుపతి తుడా: తిరుపతి రుయాలో వసతుల కల్పనకు అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ గత నెల 14న రుయాలో పర్యటించారు. రోగులకు మౌలిక వసతుల కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రుయా అధికారులు స్పందించి ఆరోగ్యశ్రీ నిధులతో ఐసీయూలో 20 పడకలు, వైద్యులు, సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్ సమకూర్చారు. అత్యవసర విభాగంలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించారు. ఓపీ సమాచారాన్ని తెలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఆరోగ్యానికి సంబంధించిన వీడియోలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రత్యేక స్క్రీన్ బోర్డులు, పరీక్షల రిపోర్టులను అదేరోజు అందేలా చర్యలు తీసుకున్నారు. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, రక్త పరీక్షలు ఒకే చోట చేసేలా చూశారు.

పోటా పోటీగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు బుధవారం పోటా పోటీగా సాగాయి. టీటీడీ సీనియర్ అధికారుల బాల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో వెంకటేశ్వర్లు విజేతగా, మనోహరం రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లు పైబడిన పురుష ఉద్యోగుల టెన్నిస్ డబుల్స్‌లో కుమార్, దినకర్ విజేతులుగా, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరమణ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు పురుష ఉద్యోగుల టెన్నిస్ సింగిల్స్‌లో దినకరన్ విజేత, సంకలి రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో రెడ్డెప్ప విజేతగా, మణిచంద్ర రన్నరప్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో విజయలక్ష్మి విజేతగా, అరుణకుమారి రన్నర్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో గంగోజమ్మ, మాధవి విజేతగా, తులసమ్మ, సునీత రన్నర్లుగా నిలిచారు. అలాగే టీటీడీ విశ్రాంత ఉద్యోగుల క్యారమ్స్ డబుల్స్‌లో పాండురంగారెడ్డి, చంద్ర విజేతలుగా, అశోక్‌కుమార్, శ్రీనివాసులు రన్నర్లుగా నిలిచారు.

చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు


కాలువల ఆక్రమణను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : తిరుపతిలో ఎవరైనా చెరువులు, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. ఆమె బుధవారం పాన్ చెరువు, గణేష్, సాయివిష్ణు, జన చైతన్య లేఅవుట్లు తదితర ప్రాంతాలను పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతు మాధవ్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

తిరుపతి క్రైమ్ : ఇస్కాన్ టెంపుల్ వద్ద మంగళవారం రాత్రి బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. అలిపిరి పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లాకు చెందిన వీరమ్మాళ్ (60) కుటుంబ సభ్యులు 30 మంది శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఇస్కాన్ టెంపుల్ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వీరమ్మాళ్‌ను రుయా కు తరలించారు. ఆమె బుధవారం మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి


గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం


తిరుపతి సిటీ/తిరుపతి కల్చరల్ : విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని కామర్స్, కంప్యూటర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ నరసయ్య పిలుపునిచ్చారు. ధనలక్ష్మినగర్, వరదరాజనగర్‌లో ఉన్న భాష్యం పాఠశాలల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరుకోవచ్చన్నారు. అనంతరం యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు, బాలాజీ, జెడీసీఈవో బిందుమాధవి, థామ్స్ ఇన్‌చార్జ్ సుధాకుమారి పాల్గొన్నారు.

సీఐఐ తిరుపతి చైర్మన్‌గా జగన్నాథ్



తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని తాజ్ హోటల్‌లో బుధవారం సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి సీఐఐ తిరుపతి నూతన కార్యవర్గాన్ని సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ ప్రకటించారు. సీఐఐ తిరుపతి చైర్మన్‌గా జగన్నాథ్ అనిరుధ్, వైస్ చైర్మన్‌గా ఎస్పీ రాజేంద్రన్‌ను ఎంపిక చేశారు.

పిల్లల్లో వచ్చే రుగ్మతలపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, తల్లిదండ్రులు

తిరుపతి తుడా: స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం పిల్లలలో సాధారణ రుగ్మతలు- వైకల్యాలు అన్న అంశంపై పిల్లలు, తల్లిదండ్రులు, సంరక్షకులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఫిజియోథెరపీ అల్యుమిని డాక్టర్ కె ప్రవీణ్ కుమార్, సీఆర్‌సీ నెల్లూరు రిహాబిలేషన్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్, పీడియాట్రిక్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రదీప్, రుయా హాస్పిటల్ డాక్టర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మాల్ నిర్మాణం

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : ఎంఆర్‌పల్లి సర్వే నంబర్ 302లో పంగులూరి సీతమ్మ సత్రం ట్రస్టు స్థలంలో అనుమతి లేకుండానే కన్యకా ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు పీఎస్‌మాల్ పేరుతో నిర్మాణాలు చేపడుతున్నారని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు తెలిపారు. దుకాణాలిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష అడ్వాన్స్ తీసుకున్నట్లు తెలిపారు. ఉజ్వల్ సింగ్ రూ.2 లక్షలు ఇచ్చాడు. అతనికి తిరిగి డబ్బు ఇవ్వకుండా చంపుతామని బెదిరించారు. అతని ఫిర్యాదు మేరకు కొండూరి మహేష్, ఉండూరి ప్రణీత, పామిడి సత్యనారాయణ శెట్టి, మంజునాథ్ శిరీషపై కేసు నమోదు చేశారు. సత్యనారాయణ శెట్టిని రిమాండ్‌కు తరలించారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయటం ఏమనగా! నా కక్షిదారులైన ఎస్.దాన్‌బాషా, క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై 1) పి.భానుమతి దేవి, 2) వి. నిర్మల కుమారి, 3) వి.రమణ కుమారి మరియు వారి GPA అయిన ఎస్. ఖాదర్ బాషా మీద O.S.No. 30/2025 అను దావాను తిరుపతి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు నందు, చూపుదు ఆయక పత్రము మేరకు అప్పు ఉన్న మొత్తము వడ్డీతో కలిపి రూ.20,62,667/- తిరిగి ఇప్పించవలసిందిగా దాఖలు చేయడమైనది, మరియు సదరు ప్రతివాదులు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదని కోరుగా, సదరు కోర్టువారు తేది 04.03.2025న అర్జంట్ నోటీసు (Urgent Notice) ఉత్తర్వులు జారీ చేయడమైనది. కావున సదరు పి.భానుమతి దేవి మరియు ఇతరులతో, క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరిపిన, వారిపై నా కక్షిదారుడు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు: తిరుపతి జిల్లా -తిరుపతి రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, తిరుపతి సబ్ - డిస్ట్రిక్ట్ - తిరుపతి అర్బన్ మండలం - నెం.9, అక్కారంపల్లి గ్రూపు - కొంకాచెన్నయ్యగుంట గ్రామ లెక్క దాఖలా తిరుపతి టౌన్ - తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ - 22వ వార్డు కొంకాచెన్నయ్యగుంట రెసిడెన్షియల్ ఏరియా - సర్వే నెం. 163/3బి, ఖాళీ జాగాకు చెక్కుబంది: **తూర్పు:** తిమ్మినాయుడుపాలెం గ్రామ హద్దులు, **పడమర:** సుబ్రమణ్యం రాజు జాగా, **ఉత్తరం:** చెరువు, **దక్షిణం:** సర్వే నెం.164 నందు జాగా, ఈ హద్దుల మధ్య ఎ.0.50 సెంట్లు జాగా, మార్చు 2420 చ॥గ॥ సదరు జాగా తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కలదు.

సి.ఎస్. చంద్రశేఖర్, న్యాయవాది, తిరుపతి. Ph: 93936 07770